క్లుప్తంగా

స్నేహితుడి అంత్యక్రియలకు సాయం



స్నేహితుడి బంధువులకు నగదు అందజేస్తున్న మిత్రులు

కందుకూరు: తమతో పాటు చదువుకున్న స్నేహితుడి అంత్యక్రియలకు పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం అందజేసి, దాతృత్వం చాటారు. మండల కేంద్రానికి చెందిన ఆదిత్య శర్మ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. అతని కుటుంబీకులు అంతా గతంలోనే ఒకరి తర్వాత ఒకరు చనిపోయారు. ప్రస్తుతం ఒంటరిగా ఉంటున్న ఆదిత్యశర్మ.. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న తోటి స్నేహితులు ఆంజనేయులు, శివలింగాచారి, మనోహర్, రమేశ్, మల్లేశ్ తదితరులు ముందుకొచ్చారు. అతని బంధువులతో కలిసి అంత్యక్రియల్లో పాల్గొని తమ వంతుగా రూ.16,500 లు సాయం అందజేశారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



బోనాల ఊరేగింపులో మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తదితరులు

కందుకూరు: మండల పరిధిలోని జైత్వారం, బాచుపల్లి, నేదునూరు, మాన్యగూడ గ్రామాల్లో మైసమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, ఆది మైసమ్మ బోనాల ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా బోనాల ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ హాజరై పూజలు చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ఆమనగల్లు: మండల పరిధి పోలెపల్లిలో పోచమ్మ ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన కర్నాటి భగవాన్‌రెడ్డి కుమార్తె జిల్లెల శరణ్య, పవన్‌కుమార్‌రెడ్డి దంపతులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం వారు గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమం అనంతరం దాతలను గ్రామస్తులు సన్మానించారు. ఇందులో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎండపల్లి నారాయణ, సింగిల్ విండో వైస్ చైర్మన్ సత్యం, మాజీ ఎంపీటీసీ కుమార్, మాజీ సర్పంచ్ బలరాం, మాజీ ఉప సర్పంచ్‌లు దారెడ్డి అంజన్‌రెడ్డి, లాలయ్య, నాయకులు రవిప్రకాశ్, నర్సిరెడ్డి ఉన్నారు.

అతివేగం ప్రమాదకరం

తలకొండపల్లి: అతివేగం కారణంగానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ అన్నారు. మండల కేంద్రానికి చెందిన వేణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన జ్ఞాపకార్థంగా వేణు సోదరుడు సుదర్శన్ నాలుగు వేగ (నియంత్రిక) నిరోధక బోర్డులను పోలీసులతో కలిసి మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మొబైల్‌ను వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వలన జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిదానంగా వెళ్లినట్లయితే అందరికీ మేలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత, శేఖర్, పాండు, దశరథం, శ్రీశైలం, రమేష్, రఘువరన్, నితీష్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

1న వీర భద్రకాళి బ్రహ్మోత్సవాలు



భద్రకాళి మాత

ఇబ్రహీంపట్నం: పట్నం చెరువు కట్ట కింద వెలసిన వీర భద్రకాళి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 1న పార్వతీ పరమేశ్వర కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం గణపతిపూజ, నవగ్రహ మండపారాధన, హోమం, రుద్రాభిషేకం, 11.45 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం, సాయంత్రం 4.30గంటలకు సేవ (ఉరేగింపు) నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని కోరారు.

పచ్చదనంపై గొడ్డలి వేటు

ఒకవైపు అడవుల శాతం పెంచేందుకు ప్రభుత్వాలు ఏటేటా కోట్లాది రూపాయలు వెచ్చిస్తుండగా.. మరోవైపు కలప దొంగలు పచ్చదనాన్ని కూలదోస్తున్నారు. మానవ మనుగడకు ప్రాణ వాయువును ప్రసాదించే మహామహా వృక్షాలను యథేచ్ఛగా నరుకుతూ సొమ్ముచేసుకుంటున్నారు.

- యథేచ్ఛగా చెట్ల నరికివేత
- ఇటుక బట్టీలకు తరలిస్తున్న వైనం
- కనుమరుగవుతున్న వనాలు
- పట్టించుకోని ఫారెస్ట్, రెవెన్యూ అధికారులు



లారీలో అక్రమంగా తరలిస్తున్న కలప(ఫైల్)

మహేశ్వరం: మండల పరిధి గ్రామాల్లో అడవుల నరికివేత జోరుగా సాగుతోంది. ఇష్టారీతిన కొందరు కలప వ్యాపారులు పచ్చదనాన్ని కొల్లగొడుతున్నారు. చీకటి మాటున మహేశ్వరం, తుమ్మలూరు, మొహబ్బత్ నగర్, ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, హర్షగూడ, సిరిగిరిపురం, నాగారం, గొల్లూరు, గంగారం, నందుపల్లి, రావిర్యాల, పోరండ్ల, నాగిరెడ్డిపల్లి తదితర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు.

పరిశ్రమలకు సరఫరా

పొరండ్ల, కోళ్లపడకల్, సుభాన్‌పూర్, అమీర్‌పేట్, నందుపల్లి, హర్షగూడ, గంగారం, ఆకన్‌పల్లి, ఘట్టుపల్లి తదితర గ్రామాల్లో చెట్లను నరికివేస్తుండగా.. తుక్కుగూడ శ్రీశైలం ప్రధాన రహదారిపై అక్రమంగా కలప రవాణా జోరుగా సాగుతోంది. గ్రామాల్లో చింత చెట్లతో పాటు అనేక ఫలాలు ఇస్తున్న వృక్షాలను తమ గొడ్డలి వేటుతో కూలదోస్తూ.. ఇటుక బట్టీలు, మంఖాల్ పారిశ్రామిక వాడ, పక్కనే ఉన్న కొత్తూరు పరిశ్రమలకు విక్రయిస్తూ ధనం పోగేసుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, అక్రమ కలప వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

అధికారుల సహకారంతో..!

వాల్టా చట్టం ప్రకారం సొంత పొలంలో చెట్లు నరకాలన్నా.. తహసీల్దార్, ఫారెస్టు అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ ఇవేమీ పట్టని కొందరు.. అధికారుల సహకారంతో చెట్లను నరుకుతూ.. రాత్రివేళలో ట్రాక్టర్లు, లారీల్లో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. వెంచర్ల ఏర్పాటులో భాగంగా పొలాలు, తోటలను కొనుగోలు చేసిన భూ వ్యాపారులు.. భూములను చదును చేసే క్రమంలోనూ చింత, వేప, మామిడి తదితర వృక్ష సంపద కనుమరుగవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి వారిపై ఫారెస్టు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు, స్థానికులు కోరుతున్నారు.

చట్టరీత్యా చర్యలు

చెట్లను నరికి బట్టీలకు తరలిస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఇటుక బట్టీలపై దాడుల చేసి, కలప దొంగలను గుర్తించి.. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. తనిఖీల్లో భాగంగా ఇటీవల లారీలో తరలిస్తున్న కలపను స్వాధీనం చేసుకున్నాం. కేసు నమోదు చేశాం. చెట్లను నరికిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. చెట్ల నరికివేత, రవాణాపై నిఘా ఉంచాం.

– ప్రభాకర్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, మంఖాల్

రహదారి విస్తరణ పనులు చేపట్టాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి



అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మీర్‌పేట: జిల్లెలగూడ ప్రధాన రహదారి విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జిల్లెలగూడలో ఆమె పర్యటించారు. ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, కావున వీలైనంత తొందరగా పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. దీంతో పాటు రహదారిపై డ్రైనేజీ పొంగి పొర్లడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా మిథులానగర్, సత్యసాయినగర్ కాలనీల్లో వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎన్‌డీపీ పనులను మొదలుపెట్టాలని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, కమిషనర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు సిద్దాల లావణ్య, అనిల్‌యాదవ్, బొక్క రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, భూపేశ్‌గౌడ్, మాదరి రమేశ్, లక్ష్మణ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణస్వామి ముదిరాజ్‌కు నివాళి



కృష్ణస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: స్వాతంత్ర్య సమరయోధుడు, హైదరాబాద్ మాజీ మేయర్, ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ 131వ జయంతిని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు ఎడ్ల బాబురావు, మండల యూత్ అధ్యక్షుడు కొర్వి సురేందర్‌ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాములు మాట్లాడుతూ.. కొర్వి కృష్ణస్వామి సేవలను గుర్తించిన ప్రభుత్వం 9వ తరగతి పాఠ్యపుస్తకంలో ఆయన గురించి పొందుపర్చడం సంతోషకరమన్నారు. ఆయన పేరుతో యూనివర్సిటీని నెలకొల్పాలని, ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చాలని కోరారు. అనంతరం హైదరాబాద్‌లో జరుగుతున్న రాష్ట్ర ముదిరాజ్ మహాసభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు పిట్టల మల్లేశ్ ముదిరాజ్, పులగాజుల జంగయ్యముదిరాజ్, ఎడ్ల మహేందర్ ముదిరాజ్, ప్రవీణ్ ముదిరాజ్, మదన్‌మోహన్ ముదిరాజ్, నరసింహా ముదిరాజ్, రాంచంద్రయ్య ముదిరాజ్, శ్రీనాథ్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణజన్మాష్టమి



తుక్కుగూడలో గోపిక శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



పహాడీషరీఫ్‌లో..



కందుకూరు: పెద్దమ్మతండాలో కృష్ణుడు గోపికల వేషధారణలో చిన్నారులు

తుక్కుగూడ/కందుకూరు/మీర్‌పేట: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులను శ్రీ కృష్ణుడు, గోపిక వేషధారణ వేసి, ఉట్టి కొట్టించారు. మీర్‌పేట ప్రశాంతి హిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠంలో పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామిజీ బాబాకు నెమలిపించం, మురళీతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.



మీర్‌పేట: కాశీసర్వదేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడిగా కృష్ణగౌడ్



తలకొండపల్లి: భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడిగా కృష్ణగౌడ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం కృష్ణ మాట్లాడుతూ.. ఇటీవల మండల పరిధి దేవునిపడకల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని.. సంఘ్ రాష్ట్ర కమిటీ సభులు శ్యాంసుందర్‌రెడ్డి, నర్సింలు గౌడ్, హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్ బాగ్ కన్వీనర్ శ్రీధర్‌రెడ్డిల సమక్షంలో ఎన్నుకున్నారని తెలిపారు. అధ్యక్షుడిగా తనను, ప్రధాన కార్యదర్శిగా రామస్వామి, కార్యదర్శిగా అంజయ్య, ఉపాధ్యక్షుడిగా నర్సింలు, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్‌లతో పాటు మరో 10 మంది కార్యవర్గ సభ్యులను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ పదవి తనకు మరింత బాధ్యత పెంచిందని, రైతుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు తెలిపారు.

గీత కార్మికులను ఆదుకోవాలి

ఆమనగల్లు: గీత కార్మికులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సీఐ బద్యనాథ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సత్యం మాట్లాడారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాల పరిధి గ్రామాల్లో గీత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నారని చెప్పారు. వారికి కులవృత్తే జీవనోపాధి అని తెలిపారు. కల్లు గీయడానికి వెళ్లిన కార్మికులు ప్రమాదాలకు గురవుతున్నారని, వారిని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని పేర్కొన్నారు.

రాఘవేందర్‌కు ఘన సన్మానం

కడ్తాల్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్‌ను సోమవారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతునాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్, నాయకులు లాయక్ అలీ, రమేశ్, మహేశ్, రామకృష్ణ, అంజి, గోపాల్, రాజు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కొందరు రేషన్ డీలర్లు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని డీలర్ల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రేషన్ డీలర్ల సమస్యలను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చామన్నారు. రేషన్ డీలర్లకు రూ.5వేల గౌరవ వేతనం, క్వింటాల్‌కు రూ.300 కమీషన్ ఇవ్వాలని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని పేర్కొన్నారు. అనంతరం రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి రేషన్ డీలర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పులిమామిడి లక్ష్మీనారాయణ, మేడ్చల్, నాగర్‌కర్నూల్ జిల్లాల అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, సాధిక్ పాషా, మహేశ్వరం మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు ఎం ఏ.సత్తార్, రేషన్ డీలర్లు భానుచందర్, కృష్ణ, సందీప్ పలువురు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీని అర్హులైన రైతులందరికీ అందించాలని, అధికారులు సమన్వయంతో పూర్తి సమాచారాన్ని సేకరించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వ్యవసాయశాఖ అధికారులతో రుణమాఫీపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రుణమాఫీని అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కొందరు రైతులు తమకు రుణమాఫీ జరగలేదని చెబుతున్నారన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పూర్తి సమాచారాన్ని సేకరించి అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుణమాఫీ అమలులో ఏమైనా సాంకేతిక సమస్యలు వచ్చినట్లయితే వాటిని పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో మీ పరిధి దాటితే ఉన్నతాధికారులకు నివేదికను అందించాలని సూచించారు. రుణమాఫీ అందని రైతులు తమ దరఖాస్తులను మండల వ్యవసాయ(ఏఓ) అధికారులకు, వ్యవసాయ విస్తరణ(ఏఈఓ) అధికారులకు అందజేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, జగదీశ్ అప్ప, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేశ్, జితేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు రాజారత్నం, మండల వ్యవసాయ అధికారులు, మండల విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పండితులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవాదాయ ధర్మాదాయశాఖ ఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కోమరబండ గ్రామంలో బుగ్గ రామేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసం సోమవారం సందర్భంగా శివపార్వతులకు కల్యాణం, అభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఏశాల చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, రమేశ్‌రావు పంతులు, గ్రామస్తులు ఉన్నారు.

పల్లెసీమలే దేశానికి పట్టుకొమ్మలు

- గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఉండాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: పల్లెసీమలే దేశానికి పట్టుకొమ్మలు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో పల్లెలు పచ్చగా ఉండాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామ దేవతల ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలన్నారు. పోచమ్మ బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని ఆలయాన్ని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని సూచించారు. భక్తితోనే ముక్తి లభిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను స్థానిక నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, మండల అధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు గూడూరు భాస్కర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, వేణుగోపాల్, యాట నర్సింహ, ఆంజనేయులు, నరేందర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, రవీందర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, బిక్కునాయక్, లక్ష్మయ్య, జహంగీర్ అలీ, జహంగీర్‌బాబా, రామకృష్ణ, బిక్షపతి, శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఆదమరిస్తే అంతే..

చెరువు కట్టపై ఇరుకు రోడ్డు

- రాకపోకలు సాగించాలంటే వాహనదారుల బెంబేలు



నందివనపర్తి గ్రామం చెరువు కట్ట రోడ్డు

యాచారం: సహజంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు ఎక్కువ శాతం ఇరుకుగానే ఉంటాయి. రెండు వాహనాలు ఒకేసారి వెళ్లే వీలు అసలే ఉండదు. ఇక ఎదురెదురుగా వస్తున్న వాటిల్లో ఒకటి వెళ్లాలంటే మరొకటి పూర్తిగా ఒకపక్కకు ఆపాల్సిందే. లేదంటే ఎవరూ ముందుకు సాగలేరు. పైగా ఇదే తీరు మార్గం చెరువు కట్టపై ఉంటే పరిస్థితి ఎంత భయానకంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. నందివనపర్తి గ్రామ సమీపంలోని చెరువు కట్టపై రోడ్డు దుస్థితి ఇదే.

కిలో మీటర్ పొడవునా..

యాచారం-కందుకూర్ మధ్యలో ఉన్న నందివనపర్తి గ్రామం చెరువు కట్టమీదుగా ఇరు ప్రాంతాలకు అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారు కిలో మీటర్ పొడవున ఈ కట్ట రోడ్డు చిన్నదిగా ఉండటంతో పాటు.. ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు ఉన్నాయి. ఫలితంగా ఎదురుగా వచ్చే వాహనం, రోడ్డు వెడల్పు ఎంత ఉందో తెలుసుకోవడం కష్టంగా ఉందని వాహనదారులు పేర్కొంటున్నారు. ప్రమాదపుటంచునకు వెళ్తేకాని పరిస్థితి అర్థం కావడం లేదంటున్నారు. ఒక వాహనం వెళ్తున్న క్రమంలో ఎదురుగా మరో వాహనం వస్తే ప్రమాదం జరిగినట్లేనని వాపోతున్నారు.

రోడ్డు విస్తరిస్తే మేలు

ఈ మార్గంలో జరిగిన ప్రమాదాల్లో ఎంతో మంది మృత్యువాత పడగా.. అనేక మంది ఆస్పత్రి పాలయ్యారని పరిసర ప్రాంత ప్రజలు తెలిపారు. కట్ట పొడువు ఇరువైపులా గ్రిల్స్, ఎలాంటి ప్రమాద సూచికలు లేకపోవడం కూడా.. ప్రమాదాలకు దారి తీస్తుందని చెప్పారు. తాజాగా ఈ రోడ్డుపై సోమవారం ఉదయం రెండు బైక్‌లు అదుపు తప్పి, నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఇంత ప్రమాదకరంగా ఉన్న నందివనపర్తి కట్ట రోడ్డు గురించి ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రాంత వాసులు ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి కట్టను విస్తరించడం లేదా ఇరువైపులా గ్రిల్స్, సూచిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు